# కక్షలూ - కావేషాలు

గోడ గడియారం ఠంగున పన్నెండు గంటలుగొట్టింది.

ఆఫీసు కాగితాలు పట్టుకొని గుమ్మం దిగబోతున్న రమణకి బాబూ!... అన్న పిలుపు వినిపించింది, తక్కున ఆగిపోయి వెనుదిరిగి తల్లి వైపు చూసాడు...... ఏమిట న్నట్లు?

అదే బాబూ!... మీ మామయ్యకు జవాబు వ్రాయి బాబూ!...అంది, ఇంతకుముందు వచ్చిన ఉత్తరం జ్ఞప్తికి తెస్తూ!

రమణ. ఆగిన వాడల్లా చర చరా లోపలికి వచ్చాడు తల్లివైపు తీక్షణంగా చూస్తూ—,

అమ్మా!... నాకా సంబంధం వద్దు; ఏమైనా సరే నాకంఠంలో ప్రాణముండగా లీలను మాత్రం చేసు కోను, ఇక నానిశ్చయం మారదు. అన్నాడు కఠినంగా రమణ,

అతని కళ్లు చింత నిప్పుల్లా ఎరుపెక్కాయి. ముఖ మండలంలో కోపం తాండవిస్తోంది. నిలుచున్న ఫళంగా రెండు చేతులు బిగపట్టి వణికి పోయాడు.

అతని ఆకారాన్ని చూసి క్షణం సేపు స్థంభించిపో యింది తల్లి జానకమ్మ... తదేకంగా కొడుకు ముఖం లోకి చూసింది. ఆ చూపులలో చిన్నప్పటినుంచి గారా బంగా పెంచిన ప్రేమ, వాత్సల్యం ప్రస్ఫుట మవుతు న్నయ్. ఆ సంబంధం గురించి ఎందుకు చెప్పానా, అని విచారించింది. 'అలవాటులో పొరపాటులాగ' 'కాలు జారితే వెనక్కు తియ్యొచ్చుగాని - నోటి వెంట మాట జారితే వెనక్కు తియ్యడం సాధ్యం కాదు'.

చూడు బాబూ!... ఇంత చిన్న విషయానికే అంత కోపం చెందితే ఎలా!... అసంగతి చెప్పడం నాది పొరపాటు. పోనీ, ఏదో పొరపాటన చెప్పాను... అంత మాత్రాన నీ వివేక విచక్షతా, ఆలోచనా జ్ఞానం కోల్పోయావా! అని మందలింపు స్వరంలో అన్నది కొడుకువైపు చూస్తూ!

ఎటో చూస్తున్న రమణ జాలిగా తల్లివైపు చూ సాడు,

అమ్మా!... నీ కెన్నోసార్లు చెప్పాను. ఈసంబంధం వద్దని, అవినాకు యిష్టంలేదు. మామయ్య నాన్నకు చేసిన ద్రోహం సామాన్యమయినదికాదు. మనం యిప్పుడు ఇంత నాశనం కావడానికి - ఇంత దిగజారి పోవడానికి ఆ నీచుడే కారణం. మళ్లీ అటువంటి వానితో సంబంధం కలపాలని చూస్తున్నావా?

నాన్న వారి మంచితనాన్ని; నిజాయితీని, అడ్డుపెట్టు కొని చెయ్యరాని పనులుచేసి, మనల్ని ఈ దశకీడ్చిన ఆ దుష్టుడితోనా వియ్యం మందడం...వద్దమ్మా!... వద్దు. మరింకే సంబంధమైనా, నీకు నచ్చితే, ప్రయ త్నించు. దానికి నేను మనస్ఫూర్తిగ అంగీకరిస్తాను. అంతే కాని నన్ను ఈ విషయంలో మాత్రం బలవంతప ర్చకు. ఇక నా నిశ్చయం మారదు. అని గిరుక్కున వెను దిరిగి చరచరా బైటకు వెళ్ళిపోయాడు.

'నిశ్చేష్టితయై, కొడుకు వెళ్ళిన వైపు తదేకంగా చూసింది జానికమ్మ. ఊహు...పిచ్చి తండ్రి. ఇలాంటి చిన్న విషయాలకు, జరిగిపోయిన విషయాలు గుర్తుకు తెచ్చుకొని, ఆ క్షణంలో నే ఉద్రేకియై పోతాడు. వాడి మనస్తత్వమే అంత - వాడి మనసులోవున్న భావాలను - అర్థం చేసుకోవడం మన తరంకాదు, అని మనసులో అను కుంది.

నెమ్మదిగా తలెత్తి ఎదురుగా గోడమీదవున్న భర్త తైలవర్ణ చిత్రం వంక చూసింది - గడచిపోయిన వారి జీవతంలో జరిగినవన్నీ ఆమె మస్తిష్కంలో ఘుర్ణిలా తిరిగాయి. ఆమెకళ్లు చెమ్మగిలి, అశ్రు నయ నాలయినయ్. రెండు చేతులు జోడించి నమస్కరిం చింది భర్త ఫొటోకు - గడచినవన్నీ సినిమా రీళ్లలా కళ్లముందు కదిలాయి.

× × ×

జీవితంలో ఎన్నో ఆటంకాలను, ఒడుదుకులనూ, ధైర్యంతో, ఆత్మ నిగ్రహంతో తట్టుకొన్న వ్యక్తి పరం ధామయ్యగారు.

ప్రతిమానవుడు చిన్నతనంలో తన భాద్యతలను గుర్తించలేడు. కారణం బాల్యదశలోనే ఆటపాటలతో నేమి మరి ఏ ఇతర కారణాలతోనేమి ఎక్కువ ఆనందా న్ననుభవిస్తాడు. మార్పు జరుగుతున్న కొలదీ, తనబరువు- భాద్యతలను తెల్సుకుంటాడు.

పరంధామయ్యకు చిన్నతనంలో చదువు వంటబట్ట లేదు. తల్లి - తండ్రుల పట్టుదలవల్ల కాస్తో - కూస్తో

చదువుకొన్నాడు.—యుక్త వయసులోనే, అనుకూలమైన ఒక సంబందాన్ని చూసి, కొడుక్కి పెళ్ళి చేసి తమ బాద్యతలను నెరవేర్చుకున్నారా తల్లి తండ్రులు.

తన అనంతరం, కష్టార్జితమైన ఆస్తిని దాయాదుల పాలుకాకుండా, వృద్ధాప్యలో ఆస్తి నంతనూ, కొడుకు పరంధామయ్య పేర విల్లు వ్రాసి మరీ చనిపోయారు.

తండ్రి చనిపోగా, మిగిలిన ఆస్తి అప్పులరూపంలో ఋణదాతలకు పోగా, తండ్రి జ్ఞాపకార్ధం పెద్ద యిల్లు మిగిలింది. ఇంకనూ, సుక్షేత్రమైన ఇరవై ఎకరాల మాగాణిని సేద్యంచేసి కాలక్షేపం చేసేవారు పరంధామయ్య. తిండికి, బట్టకు, లోటు లేకుండా, అలా జరిగి పోయింది.

తనకు వున్నంతలో లేదనకుండా, యితరులకు తన శక్తికొలదీ యిచ్చేవారు. ఆయనయొక్క నిజాయితీని, మంచితనాన్ని చూచి, ఆ గ్రామస్తులు ఎంతో మెచ్చుకొనేవారు.

ఆయన జ్యోతిషంలో కొద్దిగ అనుభవం గడించారు. కానీ,- ఆయన, వారి తండ్రిమనసులో ఎంత చెడ్డగా చిత్రీకరింపబడ్డారో, యితరుల మనసులో అంతమంచిగా మెచ్చుకోబడినారు.

పరంధామయ్య తన యింటి గొడవలు, సంసారవిషయాలు, లేకపోతే పొలం విషయాలు తప్ప, లేనిపోని, కలహాలుగాని, యితరుల విషయంలో జోక్యం చేసుకోవడంగాని ఆయనకు సుతరామూ గిట్టదు.

కానీ, ఆయన ఉన్నతిని చూసి సహించలేని వాడు ఒక్కడే, అతని బావమరది శేషాచలం. అతని విత్తుగడలు, తనని గురించి గ్రామంలో అనుకొనే మాటలూ, ఆయనకు అవగతమవుతున్నయ్.

తన కుటుంబం గురించీ, భర్త గురించీ, అనుకునే వన్నీ, జానికమ్మగారికి దాడి ముల్లుల్లా తగిలాయి. ఇది అన్నీ తన అన్నే చేస్తున్నాడంటే ఆమె నమ్మలేక పోయింది. పైగా, యివి మరేవరైనా ప్రచారం చేస్తున్నారేమో నని సందేహం కల్గింది. కానీ, యిటువంటి విమర్శలూ, వాక్యలూ, వారిప్రశాంతమైన సంసారాన్ని కలచివెయ్యలేక పోయాయి. కారణం భార్యా-భర్తలు ఆత్మనిగ్రహంలో పరిస్థితులను ఎదుర్కొనడమే.

పరంధామయ్యగారు తన గురించి వచ్చిన వార్త అన్నిటినీ, నిర్లక్ష్యం చెయ్యడంలో అవన్నీ క్రమేసి తగ్గిపోయాయి...యిలా కాదనుకున్నాడు శేషాచలం.

రచన:
= శ్రీ సి. హెచ్. సోమలింగం =

మంచిగా అయినా, నేర్పులో, పగసాధించాలనుకొన్నాడు. తన కార్యానికి ప్రాతిపధిక వేసుకొన్నాడు.

ఒక రోజున, పొలానికి వెళుతున్న పాలేరు రాముడిని పిలచి, 'చూసావా!...రాముడు, యీ అయ్యగారి నిజాయితి! నా దగ్గర కొంత సొమ్ము తీసుకొని, యిప్పటివరకూ యివ్వలేదు. తీరా, కబురుచేస్తే నాకేమీ యివ్వలేదంటున్నారు!''...అని విషవాక్యాలు నూరి పోసాడు.

పాపం, తెల్లనివన్నీ పాలు - నల్లనివన్నీ నీళ్ళని నమ్మే ఆ పాలేరు నిజమే ననుకొన్నాడు, అది జరిగినదంతా యజమానికి విన్నవించుకొన్నాడు ఆ అమాయకుడు.

అంతా విని పరంధామయ్యగారు ఏమీ అనలేదు. చూడు రాముడూ! నువ్వు అటువంటి మాటలన్నీ లెక్కచెయ్యకు నేను వాడి దగ్గర పుచ్చుకోడంగాని, యివ్వడంగానీ, ఏమీ చెయ్యలేదు. వాడు నామీద పగసాధించాలని చూసి, విఫలుడయ్యాడు. ఎందుకో అర్ధంగాని ఈ పగ. ఇపుడు నిన్ను విధంగా ఉపయోగించుకొన్నాడు, అని చిరునవ్వుతో సమాధానం యిచ్చారు.

శ్రద్ధగా వింటున్న రాముడికి అర్ధమయినట్లుంది. నే వెళ్ళవస్తాను బాబు!...అంటూ శెలవు తీసుకొని వెళ్ళి పోయాడు. పరంధామయ్యగారు చిన్నగా నవ్వుకున్నారు వాడి అమాయకత్వానికి.

× × ×

అది రమణ పుట్టిన రోజు, ఆనాడు పరంధామయ్యగారి ఆనందానికి అవధులు లేకపోయాయి. వచ్చిన బంధువులలో యిల్లు అంతా కళకళ లాడుతోంది.—

ఆ సంతోష శుభ సమయంలో పూర్వ వైరాన్ని మరచి తన బావమరదిని వాడి కుటుంబాన్నీ, రమ్మని ఆహ్వానం పంపారు. ఆది విన్న బంధువులు ముక్కుమీద వేలు వేసుకున్నారు. పైగా, అతని ఉదార గుణాన్ని

మెచ్చుకున్నారు. — దగ్గరకు వచ్చిన అవకాశాన్ని వదలుకోనే అమాయకుడు కాదు శేషాచలం. ఆ మరునాడే కుటుంబంతో సహా వచ్చాడు శేషాచలం. పరంధామయ్యగారు ఎదురేగి ఎంతో ఆప్యాయంతో ఆహ్వానించారు. శేషాచలం మేనల్లుడిని చూసి ఎంతో సంబరపడ్డాడు.-తన అన్న వచ్చినందుకు ఎంతో ఆనందించింది జానికమ్మ. ఆ యింట్లో, ఆనాలుగు రోజులు ఆనందంగా గడచిపోయింది.

తన బావగారి ఆహ్వానాన్ని అందుకొని వారి యింటికి వచ్చినప్పటికి, అతనికి ముళ్ళమీద కూర్చున్నట్లేవుంది. కాని, ఎలాగో నిగ్రహించుకొని, తన మనసులో చెలరేగిన విద్వేషాగ్నిని, పైకి కనబడనీయక, ఎప్పటిలాగే, సరదాగా కలుపుగోలు తనంగా, మసులుకున్నాడు. వారం రోజులలో వచ్చిన బంధువులంతా పరంధామయ్యగారి వద్ద శెలవు తీసుకొని, వెళ్ళిపోయారు. ఇక మిగిలిన వారు శేషాచలం కుటుంబం మాత్రమే. ఆయేడు పంటలు లేకపోవడం వలన, ఈ మధ్య కాలంలో శేషాచలం ఆర్థికంగా, దెబ్బతిన్నాడు. ఊరినిండా, ఎన్నో అప్పులు చేసాడు. అన్నీ అతని దుర్వ్యసనాలకే సరిపోయింది. కాని, డబ్బు - దొరకడమే కష్టమైపోయింది. ఒక్క పరంధామయ్యగారు తప్ప ఎవరూ లేరు. ఆయన వద్దనైనా ఎలాగైనాసరే పుట్టించాలని వేచివున్నాడు. ఆతరుణంలోనే, కొడుకు పుట్టిననాడు కుటుంబంతో సహా రమ్మని ఆహ్వానం పంపారు. శేషాచలం ఈ అవకాశాన్ని వదలుకోవడం యిష్టంలేక భార్యా పిల్లలతో వచ్చాడు. ఇక వచ్చిన చుట్టాలు వెళ్ళిపోగా, ఎపుడు చెప్పడమా, అని అవకాశం కొరకు ఎదురు చూస్తున్నాడు.

మధ్యాహ్న సమయం. ఎండ తీక్షణంగా వుంది. భోజనం ముగించి వీధి అరుగుమీద కూర్చున్నారు పరంధామయ్యగారు తాపీగా చుట్టకాలుస్తూ. పొగను రింగులుగా పైకి వదలి ఆకాశం వైపు చూసారు. అక్కడక్కడ చిన్న మబ్బుతునకలు అవుపించాయి. ఇంతకీ ఎదురుగావున్న చింతచెట్టుమీద రెండు మైన గోరు పిట్టలు కిచకిచ మని అరుస్తున్నాయి. ఆ చెట్టు క్రింద నీడలో పిల్లలు గోలీలు ఆడుకుంటున్నారు. ఒక కుర్రవాడు రాయి పుచ్చుకొని చింతకాయలు రాల కొడుతున్నాడు.—ఆదారంటే పోతున్న అవధాని అరుగు మీద కూర్చున్న పరంధామయ్యగారిని చూసాడు.

అవధానిని చూసి, పరంధామయ్యగారు సంతోషంతో కూర్చోమని చెప్పారు. అవధానిగారూ!... ఏమిటి విశేషాలు! అని అన్నారు నవ్వుతూ.

అబ్బే...ఏం విశేషాలండీ మనకు. ఆఁ...ఇవాళ అబ్బాయి జన్మదినం గదా? చిరంజీవి కులాసాగ వున్నాడా! అని మరల అందుకొని, ఇంతకీ మీరు అదృష్టవంతులు. సలక్షణమయిన కుర్రవానికి తండ్రి అయ్యారు అన్నాడు అవధాని నవ్వుతూ...“అవధానిగారూ!... అబ్బాయిని చూసి ఆశీర్వదించండి. ఇంతకీ వాడి జాతకం వ్రాయాల సుమండీ” అని అన్నారు పరంధామయ్యగారు.

ఎంతమాట; మీరు కోరితే, నేను కాదనగలనా!. అని ముక్కుమీద వేలు వేసుకున్నాడు. వేళ్ళు లెక్కపెట్టి ఏవో లెక్కలువేసి, - ఆఁ...అబ్బాయి మంచి అదృష్టజాతకుడు. పుట్టిన నక్షత్రం చాలా మంచిది. ముందుముందు ఉజ్వలమైన భవిష్యత్తువుంది. అని అన్నాడు అవదాని. కొంతసేపాగి, తమరు నాకు శెలవు యిప్పించండి అన్నాడు లేస్తూ.

మంచిది పంతులుగారూ!...అప్పుడప్పుడు కనిపిస్తుండండి అని అన్నారు. పరంధామయ్యగారు. అవధాని శెలవు తీసుకొని వెళ్లిపోయాడు.

× × ×

ఆకాశంలో దట్టంగా మబ్బులు కమ్ముకున్నాయి. వర్షం వచ్చే సూచనలు అవుపిస్తున్నాయి. చెట్టుక్రింద ఆడుకుంటున్న పిల్లలు, కేరింతలు కొట్టుకుంటూ, గోల చేస్తున్నారు.- పక్షులు కిలకిల మని అరుస్తూ గూటికి చేరుకోవాలనీ వేగంగా ఎగిరి పోతున్నాయి. పైన వాతావరణాన్ని చూస్తూ కూర్చున్నారు పరంధామయ్యగారు. అప్పుడే శేషాచలం వచ్చి ఆయన కెదురుగా కూర్చున్నాడు. కొంతసేపు యిరువురూ, పొలాలు గురించి చర్చించుకున్నారు. ఆఖరున నెమ్మదిగా తన యిబ్బంది గురించి కదిపాడు. చూడు బావా!...యీ సంకటస్థితిలో నువ్వుగా కొంతయినా ఇయ్యి. పంటలు కోతకు రాగానే తీర్చుకుంటాను అని అన్నాడు!

వెలుగుతున్న చుట్టను నోట్లోంచి తీసి, “నువ్వ

చెప్పింది బాగానేవుంది. ఈ సంగతి నాకు వారం క్రితం చెప్పివుంటే యిచ్చేవాడిని. ప్రస్తుతం డబ్బు అంతా చేతి క్రింద కొన్ని చిల్లర అప్పులకు ఖర్చయిపోయింది. ఉత్తరం వైపునున్న రెండెకరాల పొలాన్ని అమ్మివేద్దామని అనుకుంటున్నాను. అది సరిగ్గా పంటకు రావటంలేదు. - నీకు అత్యవసరమయితే నేను ప్రస్తుతం యివ్వలేను. కొద్దిరోజులు ఆలస్యమవుతుంది'' అని అన్నారు పరంధామయ్యగారు.

శేషాచలం కొంచెం దీర్ఘంగా ఆలోచించి. ''అమ్మమ్మ...ఎంతమాట'' మీకు దగ్గరున్నప్పుడే ఇద్దురుగాని లెండి అని అన్నాడు.

ఆ మరునాడు శేషాచలం బావగారివద్ద శెలవు తీసుకొని వెళ్ళిపోయినాడు. అన్నమాట ప్రకారం రెండు వారాలు తిరక్కుండా, శేషాచలానికి డబ్బు యిచ్చారు పరంధామయ్యగారు. ఆ చనువు కొద్దీ అవసరం కలిగినపుడల్లా వచ్చి తీసుకుంటున్నాడు శేషాచలం. అలా ఈ వ్యవహారం 'వేలకి' మూడు సంఖ్య దగ్గరకు వచ్చింది వ్యవహారం.

పరంధామయ్యగారికి గడ్డు రోజులు వచ్చినపుడు కొంతయినా యివ్వమని అడిగారు. వాయిదా వేస్తూ వచ్చాడు శేషాచలం. రాను-రాను మరల పేచీలు వచ్చాయి - పరంధామయ్యగారు మోసపోయానని విచారిస్తూ ఊరుకున్నారు. ఆ విచారంతో, కాల క్రమేణా ఆయన ఆరోగ్యం పాడయింది.

అప్పటికి రమణకి ఇరవై సంవత్సరాలు. కాలేజీలో చదువుతున్నాడు. శెలవులలో రమణ ఇంటికి వచ్చాడు.-రెండు మూడు సంవత్సరాలనుండి పట్నంలో వుండటంవలన ఇక్కడ పరిస్థితులు తెలుసుకోలేకపోయాడు—కాని ఇంటికి వచ్చినప్పటినుండి, యింటి పరిస్థితులన్నీ అవగాహనమయ్యాయి. మామయ్య చేసిన పనికి, ఎప్పటికయినా ప్రాయశ్చిత్తం చెయ్యాలని అనుకున్నాడు.

ఇటు రోజులు గడిచిన కొలది పరంధామయ్యగారు మంచంపట్టారు. తన అవసానదశలో మిగిలిన కొద్ది ఆస్తినీ, రమణపేర వీలు నామా వ్రాసారు.—ఎన్నో మందులు, ఎంతో డబ్బు ఖర్చు చేసాడు రమణ. మనోవ్యాధి యని డాక్టర్లు చెప్పడంవలన ప్రయోజనం లేకపోయింది. ఆ మనోవ్యాధికి కారణం రమణకు తెలుసు తెలిసికూడ పరిస్థితుల ప్రాభల్యంవలన ఊరుకోవలసి వచ్చింది.

* * *

అది వారి కుటుంబంలో దురదృష్టకరమైన రోజులు. ఆరోజుననే పరంధామయ్యగారు కన్నుమూసారు. తల్లీ కొడుకులు మంచంవద్ద కూర్చుని గొల్లుమన్నారు. అపుడే బంధువులంతా వచ్చారు.

ధర్మరాజు లాంటివాడు, ఆయనకు ఇంతలో చావు రాసిపెట్టివుంది.' అని తలో రకంగా వ్యాఖ్యానించారు. అందరితోపాటు శేషాచలం కూడ మొసలి కన్నీరు కార్చాడు. సాలోచనంగా పరంధామయ్య ముఖంలోకి చూసాడు. హుఁ.....'పీడవదలిపోయింది' అన్నాడు అప్రయత్నంగా;

ఆ మాటలు విచారసాగరంలోవున్న ఎవ్వరికీ వినిపించలేదు. కానీ తండ్రి కాళ్ళవద్ద కూర్చున్న రమణ చెవులబడ్డాయి. కోపంతో ముఖం చేవురించింది,క్షణంలో శరీరం అంతా కంపించిపోయింది. ఉద్రేకంగా పిడికిలి బిగించి, బలంగా ఒక్క దెబ్బ కొట్టాడు శేషాచలం గడ్డం క్రింద.

అమ్మో!...''అంటూ గిర్రున తిరిగాడు శేషాచలం. ఊహించని విధంగా జరిగిపోయింది. అక్కడ చేరిన వారంతా నోటమాట రాక క్షణం, నిలుచుండిపోయారు. శేషాచలం తగిలిన దెబ్బను తడుముకుంటూ అక్కడనుండి వెళ్ళిపోయాడు.

రమణని అక్కడి వారంతా శాంతింపజేసి పరంధామయ్యగారి అంత్యక్రియలను యథావిధిగ జరిపించారు. 'కాల చక్రంలో నాలుగు వసంతాలు అవలీలగా దొర్లిపోయాయి.

× × ×

జానికమ్మ భర్త ఫోటో వంక జాలిగా చూసింది. గడచినవన్నీజ్ఞప్తికి రాగా—ఆమె కన్నులనుండిఅశ్రువులు ధారగా ప్రవహించాయి...నన్ను, రమణని ఏకాకుల్నిచేసి పోయారా, అని విలపించింది.-దుఃఖాన్ని దిగమ్రింగి, ప్రవహిస్తున్న కన్నీటిని తుడుచుకుంది. అప్పటినుండి మౌనంగాలేచి వంటింట్లోకి వెళ్ళిపోయింది. రమణకోపానికి మనసులోనే బాధపడింది.

ఇంతలో వీధిలోనుండి 'చెల్లాయ్' అన్న పిలుపు వినిపించింది. ఎవరా!...అనీ వెనుదిరిగి చూసింది. ఆమె ఆనందానికి మేరలేకపోయింది. ఆ వచ్చిన వ్యక్తిని సమీపిస్తూ రా!......అన్నయ్యా!...యిదేనా రావడం. ఎన్నాళ్ళయిందీ నిన్ను చూసి, అని సాదరంగా లోనికి ఆహ్వానించింది.

అక్కడనేవున్న ఒక సోఫాలో కూర్చున్నాడు జగన్నాథం. జగన్నాథం వరసకు జానికమ్మకు అన్నగారు. జగన్నాథం కాస్తకలిగిన వాడే. మొదటినుంచీ పరంధామయ్యగారి కుటుంబం అంటే ఎంతో అభిమానం.

హాలు అంతా చూస్తున్న జగన్నాధానికి 'కాఫీ తీసుకో' అన్నయ్యా! అన్నపిలుపు వినిపించింది. జగన్నాథం కాఫీ కప్పును మౌనంగా అందుకున్నాడు తలెత్తి ఆమె వైపు చూసాడు. అతనిలో చలనం కలిగింది. - కుంకుమ కరువైన నుదిటతో, నల్లపూసలులేని బోడి మెడతో, గాజులు పగిలి రాలిపోయిన మొండి చేతులతో ఆమె ఒక శోక దేవతలా కనుపించింది.

జగన్నాథం మొహంలో విచారరేఖలు అలుముకున్నాయ్. అతని కళ్లు చెమ్మగిల్లాయి. ప్చ్...విధివ్రాతను ఎవరు తప్పించగలరమ్మా!..., బావగారు పోయారని తెలిస్తే! కనీసం పరామర్శించడానికైనా పద్దునుగదా!...ఏమిటో, "ఈ కక్షలు - కావేషాలూనూ" మానవజీవితంలో చెలగాటా లాడుతుంటాయి...... అన్నాడు.

జానికమ్మ కళ్ళనుండి అశ్రువులు ప్రవహించసాగాయి. వస్తున్న దుఃఖాన్ని చీర చెంగులో అదుపుకుంటూ, అన్నయ్యా!...అంతా నా తలవ్రాత యిది. ఆయన పుణ్యాత్ములు క్రితం జన్మలో ఏం పాపం చేసానో, ఈజన్మలో అనుభవిస్తున్నాను. రమణని, నన్ను ఏకాకుల్ని చేసి పోయారు. వాడిని చూచుకొని ఇలా జీవచ్ఛవంలా కాలం వెళ్ళబుచ్చుతున్నాను. అంది వెక్కి వెక్కి ఏడుస్తూ.

జగన్నాథం ఆమె దుఃఖాన్ని చూడలేకపోయాడు. ఆమెను ఓదారుస్తూ, ఊరుకో అమ్మా!...జరిగిందేదో జరిగిపోయింది. దానిని మనసులో వుంచుకొని, ఇలా విచారిస్తే ఏం లాభం!...జరిగిపోయిన దానికన్నా - జరగబోయే దానిగురించికాస్త ఆలోచించాలి. నువ్విలా విచారంగా వుంటే నేను చూడలేనమ్మా!...అని అన్నాడు ఓదార్పుగా. ఇంతలో, గుమ్మం వద్ద చప్పుడయింది. ఇద్దరూ, అటు చూసారు. రమణ లోపలికివస్తూ, అకొత్తవ్యక్తిని చూసి ఆగిపోయాడు. క్షణకాలం గుర్తుకు తెచ్చుకొన్నాడు.

జగన్నాథం రమణవైపు పరీక్షగా చూసాడు. పెదవులమీద చిరునవ్వు వెలిసింది...రావోయ్!... రమణా రా!...అంటూ ఆప్యాయంగా పిలిచాడు.

రమణ, నిలుచున్న వాడల్లా, ఎం?...మామయ్యా! ...ఇదేనా రావడం...అని అన్నాడు. మరల అందుకొని, నాచిన్నతనంలో మిమ్మల్ని చూసి వుంటాను. అందుకే మిమ్మల్ని చూడగానే గుర్తుపట్టలేక పోయాను. అని నవ్వుతూ, జగన్నాథం ప్రక్కనే కూర్చున్నాడు.

ఆఁ...ఏం. రమణా, ఇప్పుడు ఏంచేస్తున్నావేమిటి? ఉద్యోగం - సద్యోగం అంటూ వుందా ఏమిటీ?...అని అన్నాడు చమత్కారంగా, వీపు తడుతూ!...

జగన్నాథం యొక్క ఆప్యాయతకూ, ఆదరణకూ, మురిసిపోయాడు రమణ. ఈ ఊరిలోనే ఒక ఆఫీసులో గుమస్తాగా, చేస్తున్నాను. ఏదో ఇలా కాలం గడిచిపోతోంది. అని, అన్నాడు.

ఆఁ...చూడు రమణా, నువ్వు కాస్త పెద్దవాడివి. వయసులో వున్న వాడివి, ఇలా ఎంతకాలమని బ్రహ్మచారిగా వుంటావ్. ఏదో, రూపవతి, గుణవతి, అయిన పిల్లను చూసి, చేసుకోకూడదూ!...ఇంటికి, మగదిక్కు కూడ నువ్వేగదా! అలా మూడు ముళ్లూ వేస్తే అమ్మ కూడ సంతోషిస్తుంది. నేను కూడ సంతోషించినవాడి నవుతాను. అని అన్నాడు జగన్నాథం.

పెళ్లిమాట వినేసరికి తల్లివైపు చూసాడు రమణ. నువ్వు ఏమైనా చెప్పావా! అన్నట్లున్నాయి ఆచూపులు.

ఏం బాబూ!...మామయ్య చెప్పింది విని అలా చెయ్యి అంది తల్లి. తిరిగి, జగన్నాథం వైపుచూసి, చూడన్నయ్యా!...మన శేషావతారం కూతురు లీలను చేసుకొమ్మన్నానని కోపం. లీలను మాత్రం చేసుకో

(తరువాయి 26వ పేజీలో)

(18వ పేజీ తరువాయి)

న్నాడు. అయినా, వాడికి సంబంధాలను నేను ఎక్కడ నుండి తేగలను. ఇక నేనేం చెయ్యను. చెప్పు మరి?...అని అంది జానికమ్మ బాధగా!......

శేషాచలం పేరు వినేసరికి నున్నగా కోపం కలిగింది జగన్నాధానికి. చూడమ్మా!...వాడి గురించి నీకు అంతగా తెలియకపోవచ్చు. వట్టి మోసగాడు. నేను కూడ ఒకసారి మోసపోయాను. నా యింట్లో వుండి, నా ఇంటి వాసాకీ లెక్క పెట్టాడు. దుర్మార్గుడు. అటువంటి వాడితోనా, సంబంధం చెయ్యడం. అది నాకు ఇష్టం లేదమ్మా:... నేను నీ మంచికే చెప్పాను. తరువాత ని యిష్టం...అని అన్నాడు. జగన్నాధం!....

ఇక ఏమీ, అనలేకపోయింది జానికమ్మ. మౌనంగా వూరుకుంది.

రమణ ముఖంలో కోపచ్ఛాయలు లీలగా కనుపించాయి.

అవును మామయ్యా!...మీరు చెప్పింది సబబుగానే వుంది. నేను అమ్మకుకూడ అదే విషయం చెప్పాను. అమ్మ వింటేగా, మరి అని అన్నాడు.

అవును. రమణా, అమ్మకేం తెలుసు. ఒక గర్భాన పుట్టినవాళ్ళ రక్త స్పర్శ అటువంటిది. బంధు ప్రేమవల్ల అలా అన్నది. అందులో అమ్మ తప్పు ఏమీ లేదు. అని అన్నాడు...

జగన్నాధం జానికమ్మ వైపు తిరిగి, చూడమ్మా!... నీ కభ్యంతరం లేకపోతే మా అమ్మాయి 'మాలతి' నిచ్చి పెళ్ళి చేద్దామని వుంది. మరి, నువ్వేమంటావో! ... అని అన్నాడు.

అదేమిటి, అన్నయ్యా!...ఏదో పరాయివాళ్ళమయినట్లు, అలా అంటావు. రాక, రాక, వచ్చావు. మాలతిని ఇస్తానంటే కాదంటానా!...మరి, రమణ ఏమంటాడో, అని, సంశయిస్తూ అన్నది...!

జగన్నాధం సంతోషంతో చూసాడు...ఏమిటోయ్, విన్నావుగా నీ అభిప్రాయ మేమిటి చెప్పు మరి. అని అడిగాడు.

సరే, మీ యిష్టం. కానీ, అమ్మ సలహా మాత్రం తీసుకోండి. అని, అచ్చటనుండి, మౌనంగా లేచి వెళ్ళిపోయాడు

జగన్నాధం ఆనందానికి మేరలేకపోయింది. 'శుభస్య శీఘ్రం' అని అన్నాడు. జానికమ్మవైపు తిరిగి, చూడు చెల్లాయ్! ఒక్క మాట. అబ్బాయికూడ ఒప్పుకున్నాడు. అంతకన్నా ఏంకావాలి నాకు. అని అన్నాడు.

అదేమిటి అన్నయ్యా!... నేను వాడికెంత చెప్పినా విన్నాడుకాదు. పైగా వాడికి ఉద్రేకం ఎక్కువ. అయినప్పటికీ వాడి మనసు మార్చగలిగావు. వాడు మాలతిని చేసుకోడానికి కారణం, నువ్వు వచ్చిన 'వేళా విశేషం' అటువంటిది. ఇంతకీ అది మా అదృష్టం అని చెప్పాలి. అంది నవ్వుతూ.

అవునుగానీ, ఇంతకీ వాడికున్న ఉద్రేకాలూ, చిటపటలూ, మీ కాబోయే కోడలు భరించగలదా!...అని అన్నాడు నవ్వుతూ.

అటువంటి భయాలు ఏవీ పెట్టుకోకండి మామయ్యా! అన్నాడు రమణ వెనుకనుంచి వస్తూ.

ఇరువురూ వెనక్కు తిరిగి చూసారు. నవ్వాపుకోలేక ఒక్కసారిగా నవ్వారు. ఘట్టివాడివోయ్!...అన్నాడు జగన్నాధం.

మీరు చెప్పింది అక్షరాలా నిజమే మామయ్యా. అని వాళ్ళ నవ్వుతో శృతి కలిపాడు—...

Edited and Published by A. N. Raghavachar, No, 32, Krisnappa Naick Tank St, Madras-I
Printed by V. Kuppuswamy Chetty Bharathamatha Press, No 39 Anderson St, Madras-I